నమస్తే తెలంగాణ





విలేజ్‌నస్పూర్ మొక్కల పెంపకం కేంద్రంలో ఏర్పాటు చేసిన వాలీబాల్ కోర్టు

# వాలీబాల్ కోర్టుగా నర్సరీ

**ప్రభుత్వం మారాక పట్టించుకోని అధికారులు**

సీసీసీ నస్పూర్, మార్చి 30 : తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ హయాంలో హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారు. ప్రభుత్వ ఆదేశాలతో అప్పటి అధికారులు హరితహారంలో నాటి న మొక్కల సంరక్షణకు చక్కటి ఏర్పాట్లు చేసి, పచ్చదనాన్ని కొనసాగించారు.అనంతరం ప్రభుత్వం మారిన తర్వాత హరితహారంలో నాటిన మొక్కలు సంరక్షించేందుకు అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో ఎండిపోతున్నాయి. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నస్పూర్‌లో మున్సిపల్ అధికారులు హరితహారం కోసం మున్సిపాలిటీ పరిధిలోని సీసీసీ కేజీబీవీ సమీపంలో ఓ నర్సరీని, విలేజ్‌నస్పూర్‌లో మరో నర్సరీని ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీలో పెద్ద ఎత్తున మొక్కలు నాటి సంరక్షించేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. 8 విడుతల్లో ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం హరితహారంపై శ్రద్ధచూపకపోవడంతో నర్సరీల్లో పెద్దగా మొక్కల పెంపకం జరుగడంలేదు. పట్టణ ప్రకృతి వనాలను పట్టించుకోవడమే మానేశారు. విలేజ్‌నస్పూర్‌లోని మొక్కల పెంపకం కేంద్రం ప్రస్తుతం క్రీడామైదానంగా మారింది. గతంలో ఇక్కడ వెంచర్ ఏర్పాటు చేసిన వారు మున్సిపాలిటీకి కేటాయించిన 10 గుంటల భూమిలో అధికారులు మొక్కల పెంపకం కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వం మారడంతో కనుమరుగైంది. ప్రస్తుతం ఇందులో పెంచిన మొక్కలన్నీ ఎండిపోయాయి. ప్రస్తుతం వాలీబాల్ కోర్టుగా మారింది. కొంత మంది క్రీడాకారులు ఇక్కడ వాలీబాల్ కోర్టును ఏర్పాటు చేసుకొని ఆడుకుంటున్నారు. ఒక మంచి ఉద్దేశంతో పచ్చదనం కోసం ఏర్పాటు చేసిన మొక్కల పెంపకం కేంద్రాన్ని అధికారులు నిర్లక్ష్యం చేయడంతోనే ఈ పరిస్థితి నెలకొందని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు.

### *హరితహారంపై నిర్లక్ష్యం సరికాదు..*



*కేసీఆర్ ప్రభుత్వ హయాంలో అటవీ సంపద పెంపుకోసం హరితహారం కార్యక్రమాన్ని చేపట్టారు. ఎనిమిది విడుతల్లో కోట్లాది మొక్కలు నాటి, 26 శాతం ఉన్న అటవీ సంపదను, 33 శాతానికి పెంచారు. పల్లెలు, పట్టణాల్లో పచ్చదనాన్ని తీసుకువచ్చారు. మేమంతా పండుగ వాతావరణంలో యేటా మొక్కలు నాటాము. ప్రభుత్వం మారిన తర్వాత నర్సరీలు, పట్టణ ప్రకృతి వనాలను పట్టించుకోవడంలేదు. నర్సరీలు కనుమరుగవుతున్నాయి. హరితహారం ప్రజలందరికీ ఉపయోగపడేది. భవిష్యత్ తరాలకు మనమిచ్చే బహుమానం స్వచ్ఛమైన వాతావరనమే. ఇందుకోసం చెట్లను పెంచడం అందరి బాధ్యత. ప్రభుత్వం మారినంత మాత్రాన ఇంత మంచి కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేయడం సరికాదు.* **- తిప్పని బానేష్, నస్పూర్**

# ఉగాది, రంజాన్ సందడి

**రద్దీగా మారిన గాంధీ చౌక్**

ఎదులాపురం, మార్చి 30 : ఉగాది, రంజాన్ పండుగలు సందర్భంగా ఆదివారం ఆదిలాబాద్ మార్కెట్ రద్దీగా మారింది. రెండు పండులతోపాటు ఆదివారం సండే బజార్ కావడంతో జనాలు పెద్ద ఎత్తున కొనుగోళు చేయడానికి వచ్చారు. వ్యాపారాలు అధికంగా జరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఆదివారం ఉగాది కావడంతో పూజా సామగ్రి కొనుగోలు చేశారు. నెల వంక కనిపించడంతో సోమవారం రంజాన్ పండుగ జరగనున్న నేపథ్యంలో సెమియాలు, డ్రై ఫ్రూట్స్ కోసం ప్రత్యేకంగా వెలిసిన దుకాణాల్లో సామాగ్రిని ముస్లీం సోదరులు కొనుగోలు చేశారు. అదే విధంగా ఆడ వాళ్లు వారికి బట్టలతోపాటు మ్యాచింగ్ గాజులు, ఇతర వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

# వన్యప్రాణుల రక్షణకు చర్యలు

- **సాసర్‌పిట్‌లలో నీటిని నింపి జంతువుల దాహార్తి తీరుస్తున్న అటవీశాఖ**
- **సీసీ కెమెరాలతో జంతువులు, పక్షుల కదలికలు నమోదు**

ఖానాపూర్ టౌన్, మార్చి 30 : వేసవిలో తాగునీటికై వన్యప్రాణులు మైదాన ప్రాంతాలకు వస్తున్న నేపథ్యంలో వాటి రక్షణకు ఆటవీశాఖ అధ్వర్యంలో పటిష్ట చర్యలు చేపట్టారు. ఐదారు నెలలుగా వర్షాలు లేక అటవీ ప్రాంతంలోని వాగులు, వంకలు, నీటి జాలు గుంతలన్నీ వట్టిపోయాయి. దీంతో అడవి జంతువులకు తాగునీరు దొరకడం కష్టంగా మారింది. నీళ్ల కోసం ఇటీవల దుప్పులు మైదాన ప్రాంతాలకు వచ్చి కుక్కల దాడిలో గాయపడిన ఘటనలు సైతం చోటు చేసుకున్నాయి. గతంలో అడవి జంతువుల దాహార్తిని



కుక్కల దాడిలో గాయపడిన దుప్పిని కాపాడిన యువకులు

తీర్చేందుకు ఆటవీ ప్రాంతంలో పలు చోట్ల ఏర్పాటు చేసిన సాసర్ పిట్(నీటి తొట్లు)లలో నీటిని నింపుతున్నారు. ఖానాపూర్ ఆటవీ రేంజ్ పరిధిలో 31 సాసర్ పిట్‌లు ఏర్పాటు చేశారు. ఆ తొట్లలో వాతావరణాన్ని బట్టి 10–15 రోజులకొసారి ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతున్నారు. అ నీటితోనే జంతువులు, పక్షులు దాహార్తిని తీర్చుకుంటున్నాయి. వీటితో పాటు ఖానాపూర్ రేంజ్ పరిధిలో 7 చోట్ల ప్రత్యేకంగా సోలార్ బోర్‌బావులు ఏర్పాటు చేసి వాటితో కూడా జంతువుల దాహార్తిని తీరుస్తున్నారు. అటవీశాఖ తీసుకుంటున్న చర్యలతో వన్యప్రాణుల సంతతి పెరిగి జీవవైవిధ్యం నెలకొంటున్నది. సాసర్ పిట్‌ల పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నీరు తాగేందుకు వచ్చే పక్షులు, జంతువుల కదలికలను కెమెరాల్లో నమోదు చేస్తున్నారు. ఆ కెమెరాల నుంచి ఫొటోలను డంప్ చేసుకుని వాటి బాగోగులు, ఆరోగ్య పరిస్థితులను అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా అడవిలో తోడేళ్లు, జింకలు, దుప్పులు, కుందేళ్లు, కొండ గొర్రెలు ఇతర వన్యప్రాణులు ఉన్నట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు.



ట్యాంకర్ ద్వారా నీటిని నింపుతున్న సిబ్బంది



సాసర్ పీట్‌లో నీటిని తాగుతున్న అడవి బర్రెలు

### *సాసర్ పిట్‌లలో నీటిని నింపుతున్నాం*



*వేసవిలో అడవి జంతువుల సంరక్షణకు గాను సాసర్ పిట్‌లలో నీటిని నింపుతున్నాం. ఖానాపూర్ ఆటవీరేంజ్ పరిధిలో 31 సాసర్ పిట్‌లు ఏర్పాటు చేశాం. అటవీశాఖ ఆధ్వర్యంలో తీసుకుంటున్న చర్యలతో జంతువుల సంఖ్యపెరగడం శుభసూచకం. అంతే కాకుం డా వేసవిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం. అటవీ శివారు ప్రాంతాల్లో బేస్‌క్యాంపు సిబ్బంది నిరంతరం కపలాగా ఉంటున్నారు.*

**-కిరణ్‌కూమార్, ఎఫ్‌ఆర్‌వో, ఖానాపూర్**

# భానుడి భగ భగ

***రోజు రోజుకు ఎండలు మండిపోతున్నాయి. ఆదివారం ఉష్ణోగ్రత అధికంగా ఉండడంతో ఖానాపూర్ పట్టణంలోని తెలంగాణ తల్లి, ఎన్టీఆర్ చౌరస్తాలు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. నిత్యం జనంతో బిజీబిజీగా ఉండే ప్రధాన కూడళ్లు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రజలు బయటకు రాకపోవడంతో బోసిపోయి కనిపించాయి. ఎండ వేడిమిని భరించలేక ప్రజలు, వ్యాపారులు సమతమతమవుతున్నారు. గరిష్ఠంగా 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ప్రజలు వడ దెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యధికారులు సూచిస్తున్నారు.*** **- ఖానాపూర్, మార్చి 30**



తెలంగాణ తల్లి చౌరస్తాలో నిర్మానుష్యంగా దర్శనమిస్తున్న రోడ్లు




కొలాంగూడ లో భగీరథ పైప్ లైన్ కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

# భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు

రెబ్బెన, మార్చి 30 : ఖైర్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని కొలాంగూడ, గొల్లగూడల్లో మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టారు. 20వ తేదీన 'నమస్తే తెలంగాణ'లో 'తాగునీటికి కటకట' శీర్షికన ప్రచురితమైన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టారు. ప్రస్తుతం కొనసాగుతున్నాయి. గ్రామాల్లో నీటి సమస్య లేకుండా అన్ని చర్యలు తీసుకుంటామని, మిషన్ భగీరథ నీరు ఇంటింటికీ అందేలా చర్యలు తీసుకుంటామని మిషన్ భగీరథ ఇన్‌ట్రా డీఈఈ మతీన్ అహ్మద్ తెలిపారు.

# జమా మసీదు పన్ను చెల్లింపు

మంచిర్యాల అర్బన్, మార్చి 30 : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ ఏరియాలో గల జమా మసీదుకు సంబంధించిన పూర్తి పన్ను రూ.2,16,102ను నిర్వాహకులు చెల్లించినట్లు మున్సిపల్ అధికారి ఆర్వో శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ప్రతి ఒక్కరూ విధిగా మున్సిపాలటీ పన్ను చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పల్లె ప్రకృతి వనంపై నిర్లక్ష్యం ఎందుకో?

నార్నూర్,మార్చి 30: ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలని ఉద్దేశంలో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనాల పరిస్థితి అధ్వానం గా మారాయి. గతబీఆర్ఎస్ ప్రభుత్వంలో వేల రూపాయలతో పల్లె ప్ర కృతి వనాలు ఏర్పాటు చేశారు. వేల మొక్కలు నాటి కంటిరెప్పలా కాపాడారు. ప్రస్తుతం పల్లె ప్రకృతి వనాలు ఎడారిని తలపిస్తున్నాయి. పల్లె ప్రకృతి వనాలకు ఏర్పాటు చేసిన కంచెలు, బోర్డులు ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన్నపట్టి నుంచి మండల,పంచాయతీ అధికారుల పర్యవేక్షణ కరువైంది. కూర్చిలకే పరిమితమవుతున్నారు. ఏదైనా సమస్యపై వివరణ కోరితే..పంచాయతీకి నిధులు రావడం లేదంటూ చెబుతున్నారు. ఎప్పటి వరకు అప్పులు చేసి పనులు చేపట్టాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని భీంపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గోండుగూడ గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం అధ్వానంగా మారినా కనీసం పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఎండిపోతున్న పల్లె ప్రకృతి వనాన్ని సంరక్షించాలని గ్రామస్తులు కోరుతునానరు.



భీంపూర్‌లో ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనం

# రాబడి

## ఈ 5 పోస్టాఫీస్ స్కీములతో పన్ను లాభం

**తపాలా** శాఖ నుంచి వచ్చే చిన్న మొత్తాల పొదుపు పథకాలను.. దేశంలోనే అత్యంత సురక్షితమైన పెట్టుబడి సాధనాలుగా చెప్పవచ్చు. ఇందుకు కారణం భారత ప్రభుత్వం భరోసా ఉండటమే. పైగా ఆయా స్కీముల్లో పెట్టుబడులపై, వాటిద్వారా పొందే ఆదాయంపై ఆదాయ పన్ను చట్టం–1961లోని సెక్షన్ 80సీ కింద మదుపరులకు పన్ను మినహాయింపులూ వర్తిస్తాయి. ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షలదాకా క్లెయిమ్ చేసుకోవచ్చు. ఇలాంటి ఐటీ ప్రయోజనాలున్న 5 పోస్టాఫీస్ స్కీములను ఒక్కసారి పరిశీలిస్తే..

**పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్)**

అత్యంత ప్రజాదరణ పొందిన దీర్ఘకాలిక పెట్టుబడి పథకాల్లో పీపీఎఫ్ ఒకటి. కనీస పెట్టుబడి రూ.500. గరిష్ఠం ఏటా రూ.1.5 లక్షలు. పీపీఎఫ్‌పై వడ్డీరేటు ఈ ఏడాది ఏప్రిల్–జూన్ త్రైమాసికానికి 7.1 శాతం. పీపీఎఫ్‌లో డిపాజిట్లకు, దానిపై పొందే వడ్డీ ఆదాయానికి, మెచ్యూరిటీ మొత్తాలను తీసుకున్నా ఎలాంటి పన్నులూ ఉండవు.

**నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్స్ (ఎన్ఎస్‌సీ)**

ఎన్ఎస్‌సీ అనేది ఓ ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ ఇన్వెస్ట్‌మెంట్ స్కీం. దీనిద్వారా గ్యారంటీడ్ ఆదాయం, ట్యాక్స్ సేవింగ్స్ రెండూ ఉంటాయి. ఈ ఏప్రిల్–జూన్ త్రైమాసికానికి గాను వడ్డీరేటు 7.7 శాతం. మెచ్యూరిటీపై పొందవచ్చు. ఇక ఈ స్కీంలో కనీసం రూ.1,000, గరిష్ఠంగా ఎంతైనా పెట్టుబడి పెట్టవచ్చు. ఎన్ఎస్‌సీ కాలపరిమితి ఐదేండ్లు. అయితే పెట్టుబడిపై రూ.1.5 లక్షలదాకా పన్నుండకపోయినా.. వడ్డీ ఆదాయంపై పన్నులుంటాయి. అయితే పన్ను ప్రయోజనాల కోసం తొలి నాలుగేండ్లలో రీఇన్వెస్ట్ చేసుకోవచ్చు.

**సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్‌వై)**


ఆడపిల్లల కోసం ఉద్దేశించిన పథకమే ఈ ఎస్ఎస్‌వై. ఇందులో పన్ను ప్రయోజనాలతో కూడిన అధిక రాబడులుంటాయి. కనీసం రూ.250, గరిష్ఠంగా ఏటా రూ.1.5 లక్షల వరకు పెట్టుబడిగా పెట్టవచ్చు. పెట్టుబడికి, వడ్డీ ఆదాయానికి, మెచ్యూరిటీ మొత్తాలకు పన్నులుండవు. ఈ ఏడాది ఏప్రిల్–జూన్‌కిగాను వడ్డీరేటు 8.2 శాతంగా ఉన్నది. వార్షిక ప్రాతిపదికన లెక్కిస్తారు. ఏటేటా చక్ర వృద్ధిని అనుసరించి లాభాల్ని అందిస్తారు.

**సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీం (ఎస్‌సీఎస్ఎస్)**

వృద్ధులను ఉద్దేశించి తెచ్చిన పథకం ఇది. ఎస్‌సీఎస్ఎస్‌లోనూ పన్ను ప్రయోజనాలతో కూడిన లాభాలుంటాయి. ఇందులో కనీస పెట్టుబడి రూ.1,000, గరిష్ఠ పెట్టుబడికున్న పరిమితి రూ.30 లక్షలు. అయితే పెట్టుబడిపై రూ.1.5 లక్షలదాకా పన్నుండకపోయినా.. వడ్డీ ఆదాయానికి పన్నుంటుంది. ఈ ఏప్రిల్–జూన్‌కిగాను వడ్డీరేటు 8.2 శాతం.

**ఐదేండ్ల పోస్టాఫీస్ టైం డిపాజిట్ (పీవోటీడీ)**

ఇందులో కనీస పెట్టుబడి రూ.1,000. గరిష్ఠంగా ఎంతైనా పెట్టుకోవచ్చు. వడ్డీ ఆదాయానికి పన్నులు వర్తిస్తాయి. రూ.1.5 లక్షల దాకా పెట్టుబడులకు పన్ను మినహాయింపులుంటాయి. అయితే ఐదేండ్లలోపు పెట్టుబడులను వెనక్కి తీసుకుంటే పన్ను ప్రయోజనాలు వర్తించవు. ఈ ఏప్రిల్–జూన్‌కిగాను వడ్డీరేటు 7.5 శాతం. మూడు నెలలకోసారి లెక్కించి ఏడాదికోసారి చెల్లిస్తారు.






# గోల్డ్ vs నిఫ్టీ50

## దీర్ఘకాల పెట్టుబడికి ఏది ఉత్తమం?

**దేశీయ** స్టాక్ మార్కెట్లలో ఇటీవలి ర్యాలీ బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) సూచీ సెన్సెక్స్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీలకు గొప్ప లాభాలనే అందించింది. ఒక్క వారంలోనే సుమారుగా సెన్సెక్స్ 4.35 శాతం, నిఫ్టీ 4.45 శాతం చొప్పున ఎగిశాయి మరి. అయితే ఇన్వెస్టర్స్ పోర్ట్‌ఫోలియోలో బంగారం, వెండికి ప్రత్యామ్నాయంగా స్టాక్ మార్కెట్ పెట్టుబడులను ఎంచుకోవడానికి లేదా పెంచుకోవడానికి ఇది చాలదు. ఎందుకంటే ఈ ఏడాది మొదలు ఇప్పటిదాకా అంటే జనవరి–మార్చిలో అటు సెన్సెక్స్, ఇటు నిఫ్టీ రెండూ ఇంచుమించుగా 1 శాతం, 0.60 శాతం చొప్పున పడిపోయాయి. ఇదే సమయంలో బంగారం, వెండి ధరలు దాదాపు 17 శాతం, 15 శాతం మేర పెరిగాయి. ఇంకా లోతుగా చెప్పాలంటే జనవరి 1న సెన్సెక్స్ 78,139.01 పాయింట్ల వద్ద మొదలైంది. ఇప్పుడిది 77,414.92 పాయింట్ల వద్ద ఉన్నది. అలాగే నిఫ్టీ 23,644.80 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ప్రస్తుతం 23,519.35 పాయింట్ల వద్ద నిలిచింది. ఫలితంగా సెన్సెక్స్ 724.09 పాయింట్లు, నిఫ్టీ 125.45 పాయింట్లు కోల్పోయినట్టైంది. కానీ బంగారం ధర రూ.78,950 నుంచి రూ.92,150కి ఎగబాకింది. వెండి ధర రూ.89,700 నుంచి రూ.1,03,000లకు చేరింది. దీంతో గోల్డ్, సిల్వర్ రేట్లు గడిచిన 3 నెలల్లో రూ.13,200, రూ.13,300 చొప్పున ఎగిసినట్టైంది.

**ఇదీ సంగతి..**

పైన చెప్పుకున్న లెక్కలన్నీ స్వల్పకాలిక పెట్టుబడి ఆధారిత గణాంకాలే. కానీ మనం ఇక్కడ చెప్పుకోవాల్సింది దీర్ఘకాలిక పెట్టుబడికి ఏది ఉత్తమం? అన్నదే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టారిఫ్‌ల పెంపు హెచ్చరికలు.. భారత్‌సహా ప్రపంచ స్టాక్ మార్కెట్లను కుప్పకూల్చాయి. దీంతో మెజారిటీ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల రక్షణార్థం బంగారం దిశగా అడుగులు వేస్తున్నారు. ఈ పరిణామాలు స్టాక్ మార్కెట్ సూచీలను దిగువకు, గోల్డ్, సిల్వర్ సూచీలను ఎగువకు పంపాయి. ఇక భారత్ విషయానికొస్తే.. బంగారాన్ని సురక్షిత మదుపు సాధనంగా భావిస్తుంటే, బ్రాడర్ ఈక్విటీ మార్కెట్‌కు, దేశ ఆర్థిక ప్రగతికి నిఫ్టీనే ప్రాతిపదికగా తీసుకుంటారు. కాబట్టి మదుపరుల పెట్టుబడి లక్ష్యాలు, రిస్క్ అనేవి ఇక్కడ కీలకం అని గుర్తుంచుకోవాలి. వాటి ప్రకారం..

**దీర్ఘకాల రాబడులు**

గడిచిన రెండు దశాబ్దాల్లో దేశీయంగా మదుపరులకు బంగారంపై పెట్టుబడులు 8–10 శాతం మేర చక్ర వార్షిక వృద్ధిరేటును అందించాయి. అనిశ్చిత పరిస్థితుల్లోనూ పసిడిపై మదుపు ఆకర్షణీయ ప్రదర్శననే ఇచ్చింది. అయితే దీర్ఘకాలంలో నిఫ్టీలో పెట్టుబడులు 12–15 శాతం వరకు చక్ర వార్షిక వృద్ధిరేటును చూపాయి. దీంతో వృద్ధికే మీ ప్రాధాన్యత అయితే నిఫ్టీ పెట్టుబడులే లాభదాయకం.

**ద్రవ్యోల్బణం సవాళ్లు**

ద్రవ్యోల్బణాన్ని అధిగమించాలంటే బంగారం చక్కని సాధనం. కరెన్సీ విలువ తగ్గితే ఇది పెరుగుతుంది. ఇక స్టాక్ మార్కెట్లు సైతం ద్రవ్యోల్బణాన్ని మించి పరుగులు పెడుతున్నాయి. కంపెనీల లాభాలు, ఆదాయం గణనీయంగా పెరుగుతుండటంతో నిఫ్టీదే పైచేయి.

**ఒడిదుడుకులు**

పుత్తడి ధరల్లో ఒడిదుడుకులు తక్కువే. ముఖ్యంగా ఆర్థిక సంక్షోభాల ప్రభావం పెద్దగా ఉండదు. స్టాక్ మార్కెట్లపై ప్రతీ చిన్నదాని ప్రభావం కనిపిస్తుంది. అయినా త్వరగా కోలుకుంటాయి. స్థిరత్వాన్ని కోరుకునే మదుపరులకు బంగారమే ఉత్తమం. అయితే ఒడిదుడుకులను తట్టుకుని, ఓపిగ్గా ఎదురుచూస్తే నిఫ్టీ లాభం.

**ద్రవ్య లభ్యత**

భౌతిక బంగారాన్ని నగదుగా మార్చుకోవడం కొంత ఇబ్బంది. నాణ్యత, తయారీ ఇతరత్రా ఖర్చులు ఎదురవుతాయి. డిజిటల్ గోల్డ్, గోల్డ్ ఈటీఎఫ్‌లకు ఈ సమస్య ఉండదు. స్టాక్ మార్కెట్లలో షేర్ల క్రయవిక్రయాలు సులభం. నగదు లభ్యత వేగంగానే ఉంటుంది. కాబట్టి పసిడి కంటే నిఫ్టీ ఇన్వెస్ట్‌మెంట్స్‌నే త్వరగా క్యాష్ చేసుకోవచ్చు.


**పోర్ట్‌ఫోలియో**

బంగారం ఇన్వెస్టర్ల పోర్ట్‌ఫోలియోలో రిస్క్‌ను తగ్గిస్తుంది. కానీ స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో ఉంటాయి. అయితే దీర్ఘకాల పెట్టుబడులకు ఈక్విటీలే సరైనవని మెజారిటీ ఎక్స్‌పర్ట్స్ మాట.

**చివరగా..**

మార్కెట్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులనుబట్టి తమ పోర్ట్‌ఫోలియోల్లో స్థిరత్వాన్ని కోరుకునే భారతీయ మదుపరులకు బంగారంపై పెట్టుబడులే ఉత్తమం. అయితే పోర్ట్‌ఫోలియోల్లో వేగవంతమైన వృద్ధిని కోరుకునే ఇన్వెస్టర్లకు ఈక్విటీలే నయం. అయితే నిపుణుల సలహాతో ముందుకెళ్తే మరింత లాభదాయకం.

# ఆటో, జీఎస్టీ గణాంకాలు కీలకం!





**దేశీయ** స్టాక్ మార్కెట్లు గత వారం పడుతూ, లేస్తూ కొనసాగినా లాభాలనైతే నిలబెట్టుకున్నాయి. విదేశీ సంస్థాగత మదుపరులు (ఎఫ్ఐఐ) ఆఖర్లో పెట్టుబడులకు ముందుకు రాకున్నా సూచీలు వృద్ధినే కనబర్చాయి. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 509.41 పాయింట్లు లేదా 0.66 శాతం లాభపడి 77,414.92 వద్ద ఆగింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 168.95 పాయింట్లు లేదా 0.72 శాతం పెరిగి 23,519.35 దగ్గర నిలిచింది. అయితే ఈ వారం మదుపరుల పెట్టుబడులు ఫిబ్రవరి ఆటో అమ్మకాలు, వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) గణాంకాల ఆధారంగా కొనసాగే వీలున్నట్టు మెజారిటీ నిపుణులు చెప్తున్నారు. అయినప్పటికీ డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ కదలికలు కీలకమని గుర్తుచేస్తున్నారు. అలాగే గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, ఎఫ్ఐఐ పెట్టుబడులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలూ దేశీయ మార్కెట్లను ప్రభావితం చేస్తాయని చెప్పవచ్చు. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 23,200 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,900 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,800–24,000 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

**మార్కెట్ పల్స్**

***గమనిక..** స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదుడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.*

# ఆరోగ్య బీమా.. ఓ స్మార్ట్ పెట్టుబడి




**నేడు** వైద్య ఖర్చులు ఏ స్థాయిలో పెరిగిపోయాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ నేపథ్యంలో ప్రతీ ఒక్కరికీ ఆరోగ్య బీమా తప్పనిసరి అంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవడం.. మీ కుటుంబ భవిష్యత్తుపై పెట్టుబడి పెట్టినట్టే. ఇక గతంతో పోల్చితే ప్రస్తుతం అందుబాటులో ఉంటున్న ఆరోగ్య బీమా పాలసీలు.. కేవలం దవాఖానల్లో చేరికలకేగాక, ఓపీడీ సంప్రదింపులు, టెలీ మెడిసిన్, ముందస్తు వైద్య పరీక్షలు, ప్రసూతి, మానసిక, రిహాబిలిటేషన్, ఇతర ఆరోగ్య సంరక్షణ సేవల్నీ అందిస్తుండటం విశేషం. నిజానికి మారిన జీవనశైలితో ఇప్పుడు చాలా మంది వయసుతో సంబంధం లేకుండా షుగర్, బీపీ సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. గుండె–కిడ్నీ సమస్యలు, క్యాన్సర్ వంటి ప్రమాదాలబారిన కూడా పడుతున్నారు. దీంతో ఇలాంటివారికి ఆరోగ్య బీమా, ప్రధానంగా క్రిటికల్ ఇల్‌నెస్ రైడర్లుండే పాలసీల అవసరం చాలా ఉంటున్నది. ఇలాంటి కవరేజీలను ఎస్బీఐ జనరల్ ఇన్సూరెన్స్‌సహా అనేక సంస్థలు ప్రభావవంతంగా అందిస్తున్నాయి. పైగా ఆదాయ పన్ను (ఐటీ) చట్టంలోని సెక్షన్ 80డీ కింద ఆరోగ్య బీమా కోసం చెల్లించే ప్రీమియంలపై పన్ను మినహాయింపులనూ అందుకోవచ్చు. 60 ఏండ్ల లోపువారికి ఏటా రూ.25,000దాకా, ఆపై వయసున్న సీనియర్ సిటిజన్లకు రూ.50,000 వరకు పన్ను మినహాయింపులను పొందవచ్చని నిపుణులు చెప్తున్నారు. కాబట్టి ఈ ఉగాదితో మొదలైన కొత్త ఏడాదిలో ఆరోగ్య బీమా ఆవశ్యకతను గుర్తించి ఓ సానుకూల నిర్ణయం తీసుకోండి. ఒకవేళ ఇప్పటికే ఆరోగ్య బీమా ఉన్నట్టైతే.. సమగ్ర కవరేజీలుండే, ఇంటిల్లిపాదికి అవసరమయ్యే మరింత మెరుగైన బీమాను కొనడం ఉత్తమం.

